RNI APTEL/2001/6603 HSE-759/2006-2008

# శ్రీ సాయి దర్శన్

సాయిప్రబోధ ప్రచార మాసపత్రిక

## అనుబంధ సంచిక - 5

ఖననం చేసి, దానిపై సమాధి కట్టాలని చెప్పారు. గ్రామాధికారి అయిన రామచంద్రపాటిల్ మొదలైనవారు బాబా చివరిమాట ప్రకారం, బూటీవాడలో వారిని సమాధిచేయాలని అన్నారు. ఇలా గ్రామస్థులు రెండు వర్గాలుగా చీలిపోయారు. వివాదం మరుసటి రోజు సాయంత్రం వరకు కొనసాగింది.

బుధవారం ఉదయం లక్ష్మణ్‌మామ జోషి (శ్యామా మేనమామ)కి కలలో బాబా కనపడి, "లే ! బాపూసాహెబ్ నేను చనిపోయానని అనుకునాడు! అందువల్ల అతడు రాడు. నీవే వెళ్ళి పూజ, కాకడ ఆరతి జరిపించు" అన్నారు. లక్ష్మణ్ మామ సనాతన బ్రాహ్మణుడు. ఇతనికి బాబాపై అపారమైన నమ్మకముంది. ఇతడు ప్రతిదినం బాబాను పూజించి, తర్వాత గ్రామంలో నున్న దేవతలందరిని పూజించేవాడు. బాబా కలలో కనబడిన వెంటనే పూజ సామగ్రితో మశీదు చేరాడు. మౌల్వీలు అభ్యంతరపెడుతున్నా, లెక్కచేయక బాబాకు పూజచేసి, కాకాడ ఆరతి జరిపించి వెళ్ళిపోయాడు. బాపూసాహెబ్ జోగ్ మధ్యాహ్నం భక్తులతో వచ్చి మధ్యాహ్న ఆరతి జరిపించాడు.

రహతా నుండి పోలీస్‌ఇన్‌స్పెక్టరు, బొంబాయినుండి అమీర్ భాయి, కోపర్‌గావవ్ నుండి మమల్తదారు వచ్చి వివాదాన్ని పరిష్కరించడానికి పూనుకున్నారు. ఎన్నికతో ప్రజాభిప్రాయాన్ని సేకరించారు. బాబాను బూటీవాడలో సమాధి చేయాలనేవారు, మిగతావారి కన్నా రెండురెట్లు అధికంగా ఉన్నారు. అయినప్పటికీ కలెక్టరును సంప్రదించడానికి, దీక్షిత్‌ను అహమద్‌నగర్ పంపాలనుకున్నారు. కానీ ఈలోపు ప్రజాభిప్రాయం ఏకగ్రీవమయ్యింది. బాబా ప్రేరణవల్ల మిగతావారు కూడా బాబాను వాడలో సమాధి చేయడానికి ఒప్పుకున్నారు.

బుధవారం సాయంత్రం బాబా శరీరాన్ని పూలమాలలతో కప్పి, ఊరేగింపుగా తీసుకెళ్ళారు. శాస్త్రోక్తంగా వాడలో మురళీధరుడుండవలసిన స్థలంలో సమాధి చేశారు. బాలా సాహెబ్ భాటే, ఉపాసనీబాబా, శాస్త్రోక్తంగా బాబాకు ఉత్తరక్రియలు జరిపించారు.

పండరిపురంలో దాసగణుకు అక్టోబర్ 16న బాబా కలలో కనబడి, "మశీదు కూలిపోయింది. ఇక్కడి నూనె వర్తకులు నన్ను చాలా చీకాకుపెట్టారు. అందుకే షిరిడీ వదిలిపెట్టాను. ఆ విషయం చెప్పడానికే నీ దగ్గరకొచ్చాను. వెళ్లు. త్వరగా వెళ్ళి నన్ను పూలమాలతో కప్పు" అన్నారు. దాసగణకు బాబా సమాధి చెందిన విషయం అంతకుముందే ఉత్తరం ద్వారా తెలిసింది. వెంటనే దాసగణు తన శిష్యులతో షిరిడీవెళ్ళి, సమాధి ముందు, భజన కీర్తన కార్యక్రమం జరిపించారు. పూలతో సమాధిని కప్పాడు. బాబా పేరు మీద అన్నదానం చేశాడు.

బాబా మహాసమాధి చెందడానికి 32 సం॥ల ముందు, అనగా 1886లో ఒక మార్గశిరపౌర్ణమినాడు రాత్రి 10 గం॥ల సమయంలో దగ్గు, ఆయసంతో బాధపడుతూ, తమ ప్రాణాల్ని అనంతవాయువుల్లో లీనం చేశారు. వారు మహల్సాపతి తొడపై తలపెట్టి, పడుకుని, 'నా శరీరాన్ని మూడు రోజులు భద్రంగా కాపాడు. నేను తిరిగివస్తే సరే ! లేదా అక్కడ స్థలం చూపించి నన్ను పాతపెట్టి గుర్తుగా రెండు జండాలను నాటు" అని చెప్పి ప్రాణం విడిచారు. బాబా మరణించారనే వార్త ప్రాకింది. అహమద్‌నగర్ నుండి ఇంగ్లీషు డాక్టర్‌వచ్చి బాబా మరణించినట్లు ధృఢపరచారు. గ్రామపెద్దలు పంచనామా జరిపించి బాబాను సమాధిచేయాలని నిర్ణయించారు. కానీ మహల్సాపతి మరికొందరు భక్తులు అందుకు ఒప్పుకొనలేదు. బాబా తలను తనతొడపై నుంచుకొని, మహల్సాపతి మూడు రోజులు కాపాడారు.

భక్తులందరూ హరినామసంకీర్తన చేస్తూ, బాబా చెంతనే జరిపారు. మూడవరోజున వేకువన 3 గం॥ల సమయంలో, బాబా కళ్ళు తెరిచారు. నిద్రించి మేల్కొన్నవారివలె చేతులు జాడించి, లేచి కూచున్నారు. లోక కళ్యాణం కోసం, వారు సమాధి స్థితి వీడారు.

దీనిని బట్టి సాయి జనన మరణాలకతీతులని తెలుస్తుంది. వారు దేహము వీడినను, సకల చరాచర జీవరాసుల్లో వసిస్తున్నారు. వారు షిరిడీలో వున్నారు. సర్వత్రా వున్నారు. అనన్యభక్తితో కొలచినవారికి ప్రత్యక్షమై వారి కోరికలను నెరవేరుస్తున్నారు. ద్వారకామాయిలో శ్యామారావు జయకర్‌చే చిత్రింపబడి, ప్రతిష్ఠించిన బాబా నిలువెత్తు చిత్రం బాబా సశరీరులుగా నున్నట్లు, మనకు అనుభవం కలిగిస్తుంది. చూచి

# బాబా సమాధి చెందుట

### శ్రీసాయిసచరిత్ర: 42, 43, 44 అధ్యాయములు)

1918 సెప్టెంబరు 28వ తేదీన బాబాకు తీవ్రంగా జ్వరం వచ్చింది. ఇది రెండు, మూడు రోజులుండి తగ్గిపోయింది. కానీ తర్వాత వారు ఆహారం తీసుకోవడం మానివేశారు. అందువల్ల బాబా బలహీనమైపోయారు. 17రోజుల తర్వాత అంటే అక్టోబర్ 15వ తేదీ మంగళవారం, మధ్యాహ్నం గం॥ 2.30 ని॥లకు తన భౌతికశరీరాన్ని విడిచిపెట్టారు. ఆ రోజు విజయదశమి పర్వదినం.

రెండు సం॥లకు ముందే దీనికి వారు సూచనలిచ్చారు. కానీ ఎవ్వరూ అప్పుడు అర్థంచేసుకోలేకపోయారు. 1916వ సం॥ విజయదశమినాడు సాయంత్రం గ్రామస్థులంతా సీమోల్లంఘన ఉత్సవం జరుపుకుని తిరిగివస్తున్నారు. అప్పుడు బాబా అకస్మాత్తుగా కోపోద్రిక్తులయ్యారు. తమ తలగుడ్డ, కఫనీ, లంగోటా తీసి పీలికలు చేసి ధునిలో వేశారు. మంటపై కెగసిన ధుని మందు నగ్నంగా నిలబడ్డారు. కళ్ళు చింతనిప్పులవలె మండుతున్నాయి. "ఒరేయ్ ! ఇప్పుడు చూడండిరా నన్ను ! నేను హిందువో, ముస్లిమో తెలుసుకొండి" అన్నారు. ఎవ్వరూ దగ్గరకి వెళ్ళడానికి సాహసించలేదు. చివరకు కుష్ఠురోగభక్తుడు భాగోజీషిండే ధైర్యంగా బాబా ముందుకు వెళ్లి లంగోటి బిగించాడు, "బాబా ! ఏమిటిది? ఈ రోజు సీమోల్లంఘన పండుగ. మీరు యిలా చేయవచ్చా?" అన్నాడు. అందుకు బాబా; "అవును ఈ రోజు నా సీమోల్లంఘనమే" అని సటకాను గట్టిగా నేలమీద కొట్టారు. ఆ రోజు రాత్రి 11 గం॥ల వరకు బాబా శాంతించలేదు. చావడి ఉత్సవం జరుగుతుందో లేదో అని అనుమానించారు. కానీ కాసేపటికి బాబా మామూలు స్థితికి వచ్చారు. చావడి ఉత్సవం యథాప్రకారం జరిగింది. వారు దసరాయే తన సీమోల్లంఘనమని (సరిహద్దులు దాటి వెళ్లటం) స్పష్టంగా సూచనలిచ్చినా ఎవ్వరికీ అప్పుడు అర్థం కాలేదు.

బాబా సమాధికి కొన్నిరోజుల ముందు భవిష్యత్తును సూచిస్తూ ఒక దుశ్శకునం జరిగింది. బాబా దగ్గర చిరకాలంగా ఒక ఇటుకరాయి వుండేది. పగలు దానిపై చెయ్యి ఆనించి కూచునేవారు. రాత్రుళ్లుదానిని తలగడగా ఉపయోగించేవారు. ఒక సేవకుడు మశీదు తుడుస్తూ పొరబాటుగా దానిని జారవిడిచాడు. అది రెండు ముక్కలయ్యింది. బాబా ఈ విషయం తెలిసి "ఈ రోజు విరిగింది ఇటుక కాదు. నా ప్రారబ్ధం బ్రద్ధలైంది. జీవితమంతా తోడుగా వున్న ఇటుక నన్ను వీడిపోయింది. అది నా ప్రాణం. అది లేకుండా నేను కూడా యిక వుండను" అన్నారు. అది వారి గురువుగారి ద్వారా సంక్రమించిందని చెప్పారు.

**తాత్యాకు బదులు బాబా :** 1916లో రామచంద్రపాటిల్‌కు తీవ్రంగా జబ్బుచేసి మంచాన పడ్డాడు. ఎన్ని మందులు వాడినా ప్రయోజనం లేకుండాపోయింది. అన్ని ఆశలు వదలుకొని, నిరాశగా గడుపుతూవచ్చాడు. ఒక అర్ధరాత్రి బాబా తన మంచం దగ్గర ప్రత్యక్షమయ్యారు. బాబా పాదాలు పట్టుకొని రామచంద్ర, "బాబా! జీవితంమీద అన్ని ఆశలు వదులుకున్నాను. నా చావు ఎప్పుడు నిర్ణయించారో తెలపండి" అని వేడుకున్నాడు. కరుణామయుడైన బాబా, "భయపడకు ! నీ చావు చీటి తీసివేసితిని. నాకు తాత్యావిషయమే బాధగా వుంది. అతడు 1918 విజయదశమినాడు మరణిస్తాడు. కానీ ఈ విషయం ఎవ్వరికీ చెప్పవద్దు. తాత్యాకు అసలు చెప్పొద్దు. భయపడతాడు" అన్నారు. బాబా చెప్పినట్లు రామచంద్ర కోలుకున్నాడు. క్రమంగా లేచి తిరగడం మొదలుపెట్టాడు. బాబా మాట పొల్లుపోదని రామచంద్రకు తెలుసు. అందుకే తాత్యాను గూర్చి బాధపడసాగారు.

తాత్యావిషయం బాలాషింపీ అనే భక్తునికి తప్ప మరెవ్వరికీ చెప్పలేదతను. వీళ్ళిద్దరూ అప్పుడప్పుడు కలుసుకుని, రెండు సం॥ల తర్వాత, తాత్యాకు రాబోయే ప్రమాదాన్ని గూర్చి బాధపడేవారు.

1918వ ఆశ్వయుజం వచ్చింది. తాత్యా చాలా జబ్బుపడ్డాడు. పరిస్థితి రాను రాను క్షీణించడం మొదలుపెట్టింది. బాబా దర్శనానికి కూడా రాలేక యింట్లోనే బాబాను మననం చేసుకుంటూ ఉంటేవాడు. అదే సమయంలో బాబాకు కూడా జ్వరం వచ్చింది. వారి పరిస్థితి కూడా దినదినానికి క్షీణించసాగింది. విజయదశమి రానేవచ్చింది. తాత్యానాడి బలహీనంగా కొట్టుకొంటోంది. తాత్యా మరణించే సమయం ఆసన్నమయ్యిందని, రామచంద్ర, బాలాషింపీ అనుకున్నారు. కానీ చిత్రంగా తాత్యా బ్రతికాడు. బాబా మహాసమాధి చెందారు. తాత్యాను బ్రతికించేందుకు, బాబా తన ప్రాణాన్నే ఫణంగా పెట్టారు. ఇలా ఎందుకు చేశారో? మహాత్ములు చేసే పనులు, అగోచరాలు, ఎవ్వరికీ అర్థం కావు!

లక్ష్మీబాయి షిండే గుణవంతురాలు. ధనవంతురాలు. ఆమెకు బాబా సేవయే పరమావధి. రాత్రింబవళ్లూ ఆమె మశీదులో పనిచేస్తుండేది. రాత్రిళ్ళు మసీదులోనికి మహల్సాపతి, తాత్యా, లక్ష్మీబాయికి తప్ప మరెవ్వరికీ ప్రవేశం లేదు. బాబా లక్ష్మీబాయి సేవలను గుర్తించి, తమ దేహం విడిచేముంద ఆమెకు కొంత డబ్బు దానంగా యివ్వాలని అనుకున్నారు. చివరి క్షణాలకు కాస్తముందు బాబా స్వయంగా లేచి కూచున్నారు. భక్తులందరూ ప్రమాదం దాటిపోయిందని సంతోషించారు. కానీ బాబాకు తెలుసు తమ దేహం విడిచే సమయం ఆసన్నమయింది.

జేబులో చెయ్యి పెట్టి డబ్బు తీసి దగ్గరే నిలబడివున్న లక్ష్మీబాయికి మొదట రూ.5/-లు యిచ్చారు. మరలా రూ.4/-లు యిచ్చారు. మొత్తం రూ.9/-. తొమ్మిది సంఖ్య నవవిధ భక్తికి సంకేతమై ఉండవచ్చు లేదా భాగవతంలో చెప్పబడిన శిష్యునికుండవలసిన లక్షణాలై వుండవచ్చు. (ముందు 5, తర్వాత 4 లక్షణాలు చెప్పబడ్డాయి. బాబా కూడా ఆ క్రమంలోనే యిచ్చారు.) లక్ష్మీబాయి ఆ నాణాలను బాబా సమాధి చెందిన తరువాత భక్తిశ్రద్ధలతో పూజించి ధన్యురాలయ్యింది. ఆ నాణాలను యిప్పటికి మనం శిరిడీలో ఆమె ఇంటిలో చూడవచ్చు !

అవసానకాలంలో జీవునికి పవిత్రగ్రంథాలు చదివి వినిపించడం హిందువుల ఆచారం. దీనివలన జీవుని మనస్సు ప్రాపంచికవిషయాలపై గాక ఆధ్యాత్మిక విషయాలపై లగ్నమవుతుంది. అది పరమార్థపథానికి సులభంచేస్తుంది. బాబా దేవుని అవతారంగా అయినందువల్ల ఇది అవసరం లేదు. కానీ ప్రజలు తమను ఉదాహరణగా తీసికొని, ఆచరిస్తారనే ఉద్దేశ్యంతో బాబా కూడా అనుసరించారు.

వజే అను భక్తుని రామవిజయం చదవమని ఆదేశించారు. వజే ఒక వారం రోజులు ఒకసారి చదవడం పూర్తిచేశాడు. తిరిగి రాత్రింబవళ్లు ఏకధాటిగా చదవమని చెప్పారు. వజే అలాగే చదివి 3 రోజులలో రెండవసారి పారాయణం పూర్తిచేసాడు. కానీ వజే బాగా అలసిపోయియున్నందున ఆపమని చెప్పారు. బాబా తమ ప్రయాణానికి రెండు,మూడు రోజుల ముందు నుండి గ్రామం తిరగడం, భిక్షాటన చేయడం మానుకున్నారు. అయినా తన చివరి క్షణాల సమయం ఎవ్వరికీ తెలియకుండా జాగ్రత్తపడ్డారు. కాకాసాహెబ్ దీక్షిత్, బాపూసాహెబ్ బూటీ, తనతోనే మశీదులో భోజనం చేసేవారు. విజయదశమినాడు మధ్యాహ్నం 2 గం॥ల ప్రాంతంలో భక్తులందరిని యింటికివెళ్ళమన్నారు. దీక్షిత్, బూటీలను వారి యింటిలో భోంచేసి రమ్మని పంపారు. ఇంకా లక్ష్మణ్, లక్ష్మీబాయి, భాగోజీ షిండే, భయ్యాజీ, బాలాషింపీ, నానాసాహెబ్ నిమోన్కర్ అక్కడే వున్నారు. శ్యామా మసీదుమెట్లపై కూచుని ఉన్నారు. లక్ష్మీబాయికి తొమ్మిది రూపాయలు దానం ఇచ్చినతరువాత తమకు మశీదులో బాగాలేదని, బూటీవాడకు తీసుకెళితే బాగుంటుందని చెప్పి, ప్రక్కనే వున్న భయ్యాజీపై ఒరిగిపోయారు. భాగోజీ బాబా ఊపిరి పీల్చడం లేదని గమనించాడు. ఆ విషయం వెంటనే నిమోన్కర్‌తో చెప్పాడు. నిమోన్కర్ తులసితీర్థం తెచ్చి, బాబా నోటిలో పోసాడు. కానీ అది బయటకు వచ్చేశాయి. "ఓ దేవా!" అంటూ బిగ్గరగా అరచాడు. అందరికీ బాబా సమాధి చెందినట్లు తెలిసిపోయింది. దీక్షిత్, బూటీ వాడాలో భోజనానికి కూచున్నారే గానీ, వారి మనస్సు బాబా దగ్గరే ఉంది. బాబా భౌతికకాయాన్ని విడిచారనే వార్త తెలిసి భోజనాన్ని అలాగా వదిలేసి మశీదుకు పరుగెత్తారు. బాబా బయ్యాజీపై ఒరిగి నిద్రిస్తునట్లు కనిపించారు. తన ఆసనం పైకూచొని దానమిస్తూ ఒరిగిపోయినట్లున్నారు.

బాబా సమాధిచెందారనే వార్త దావానలంగా వ్యాపించింది. స్త్రీలు, పిల్లలు, వృద్ధులు వీధుల వెంబడి ఏడుస్తూ మశీదుకు పరుగెత్తారు. కొందరు స్పృహ తప్పి పడిపోయారు. కొందరు స్త్రీలు గుండెలు బాదుకుంటూ విలపిస్తున్నారు. ఏడుపులు, పెడబొబ్బలతో శిరిడీ మొత్తం స్మశానవాతావరణం అలుముకుంది.

బాబా శరీరాన్నెక్కడ సమాధి చేయాలనేది పెద్ద సమస్యగా మారింది. మహమ్మదీయులు, కుశాల్‌చంద్, అమీర్‌శక్కర్ మొదలైనవారు వారిని ఆరు బయట